సాక్షి
చిత్తూరు
సోమవారం । 5 । మే । 2025



డబ్బులు కాసే చెట్టు!

జిల్లా మహోగని చెట్ల సాగుకు పలువురు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే 150 ఎకరాల్లో సాగు చేపట్టారు. - 8లో



ప్రశాంతంగా 'నీట్'

చిత్తూరులోని రెండు పరీక్ష కేంద్రాల్లో ఆదివారం ప్రశాంత వాతావరణంలో నీట్ నిర్వహించారు. - 8లో



అరకొర వైద్యం

చిత్తూరులోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలో సమస్యల కారణంగా రోగులకు సక్రమంగా వైద్య సేవలు అందడం లేదు. - 8లో

న్యూస్‌రీల్

నేడు పలమనేరులో గ్రీవెన్స్

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)ను పలమనేరు మున్సిపల్ కార్యాలయంలో చేపట్టనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు.ఆయన ఆదివారం మాట్లాడుతూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వినతులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. అన్నిశాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు.

నేడు పోలీసు కార్యాలయంలో..

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని ఆర్మ్‌డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యపై నేరుగా కలిసి తెలియజేయవచ్చని సూచించారు. ఉదయం 10.30 గంటల నుంచి వినతులు, ఫిర్యాదులను పరిశీలించి చర్యలు చేపడతామని వెల్లడించారు.

డీఆర్‌సీ సమావేశం రేపు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా అభివృద్ధి కమిటీ (డీఆర్‌సీ) సమావేశం మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. ఈ సమావేశానికి అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, గైర్హాజరైతే శాఖాపరంగా చర్యలుంటాయని హెచ్చరించారు.

చిత్తూరు డీవైఈఓగా ఇందిర



చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు డీవైఈఓగా రొంపిచెర్ల ఎంఈవో-1 ఇందిరను నియమిస్తూ రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. వైఎస్సార్ కడప జిల్లా ఆర్‌జేడీకి రిపోర్టు చేసిన తర్వాత డీవైఈఓ విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎమ్మెల్యే పేరుతో దౌర్జన్యం

– బాధితుల ఆవేదన



మాట్లాడుతున్న బాధితులు ఉష, సుజన

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కూటమికి చెందిన ఓ మహిళా నేత జీడీ నెల్లూరు ఎమ్మెల్యే థామస్ పేరు చెప్పి తమపై దౌర్జన్యం చేస్తున్నారని బాధితులు ఉష, సుజన ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. పెనుమూరు మండలం సామిరెడ్డిపల్లెలో తమకు రెండు ఎకరాల భూమి ఉందన్నారు. తమ తల్లిదండ్రులు పసుపు కుంకుమం కింద సదరు భూమిని ఇచ్చనట్లు వెల్లడించారు. అయితే కూటమి నేత అరుణకుమారి దారిని ఆక్రమించుకుని, దాన్ని కాపాడుకునేందుకు తమ భూమిలో సీసీ రోడ్డు వేయిస్తున్నారని ఆరోపించారు. ఎలాంటి అనుమతులు లేకపోయినా ఎమ్మెల్యే థామస్ ఆదేశించారంటూ బెదిరిస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే , ఇతర నేతలు ఆమె అక్రమాలను గుర్తించాలని కోరారు. లేకుంటే ముఖ్యమంత్రికి సైతం ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు.

ఐసెట్ హాల్ టికెట్లు విడుదల

తిరుపతి సిటీ:ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల ప్రవేశాల కోసం ఆంధ్రా యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐసెట్-2025 హాల్ టికెట్లను ఆదివారం నుంచి ఆన్‌లైన్‌లో విడుదల చేశారు. అభ్యర్థులు రిజిస్ట్రేషన్ నంబర్, హాల్‌టికెట్ నంబర్, పుట్టిన తేదీని నమోదు చేసి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని అధికారులు వెల్లడించారు. ఈనెల 7వ తేదీన ఐసెట్-2025 పరీక్ష నిర్వహించనున్నారు.

డిగ్రీ పరీక్ష సెంటర్ల మార్పు.. విద్యార్థులకు అవస్థలు



పరీక్ష కేంద్రానికి విద్యార్థిని వాహనంలో తీసుకెళుతున్న పోలీస్

తిరుపతి సిటీ: ఎస్వీయూ అధికారుల తీరుతో డిగ్రీ 2వ, 4వ సెమిస్టర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు అవస్థలు తప్పడం లేదు. దేశవ్యాప్తంగా ఆదివారం జరిగిన నీట్ కోసం డిగ్రీ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. డిగ్రీ పరీక్షల సెంటర్లు ఆయా కళాశాలలో ఏర్పాటుచేసినట్లు హాల్ టికెట్లలో ఉంది. అధికారులు మాత్రం నీట్ జరుగుతున్న కేంద్రాల్లో సెంటర్లు ఉన్న డిగ్రీ విద్యార్థులకు పక్కనున్న జూనియర్ కళాశాలల్లో సెంటర్లు ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని ముందుగా తెలియజేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అక్కడే విధి నిర్వహణలో ఉన్న పోలీసులు విద్యార్థులను సంబంధిత పరీక్షా కేంద్రాలకు తమ వాహనాల్లో తరలించారు.

అన్నదాతకు అండగా నిలవాలి.. వ్యవసాయం పండుగలా మారాలి.. సకాలంలో సకల సేవలు అందించాలి.. కర్షకుల ఆర్థికాభివృద్ధికి చేయూత నివ్వాలి.. ఇదే లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అహర్నిశలు చిత్తశుద్ధితో పనిచేసింది. సచివాలయాలకు అనుబంధంగా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి సాగును సంబరంగా మార్చింది. విత్తనాలు.. ఎరువులు.. పురుగుమందులను రైతాంగం ఇంటి ముంగిటకే చేర్చింది. ఈ క్రమంలోనే ఆర్‌బీకేలకు పలు చోట్ల సొంత భవనాలు నిర్మించింది. అయితే కూటమి సర్కారు వచ్చిన తర్వాత రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేసింది. కేవలం పేరు మార్చి సేవలను పూర్తిగా దూరం చేసింది. పథకాలు అందించకుండా అన్నదాతను ఆవేదనకు గురి చేసింది.



సుదూరంగా సేవ

- జిల్లాలో అలంకారప్రాయంగా రైతు సేవా కేంద్రాలు
- నిరుపయోగంగా కియోస్క్‌లు
- అన్నదాతకు అందని పథకాలు
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పక్కాగా పనిచేసిన ఆర్‌బీకేలు
- 503 రైతు భరోసా కేంద్రాలకు గాను 340 చోట్ల సొంత భవనాలు
- రూ.109 కోట్లకు గాను రూ.74.12 కోట్లు వెచ్చించిన జగన్ సర్కారు
- కూటమి వచ్చిన తర్వాత ఆగిపోయిన పనులు

కార్వేటినగరం : అన్నదాతకు చేయూతనందించేందుకు ఏర్పాటు చేసిన రైతు సేవా కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. కూటమి ప్రభుత్వ నిర్వాకంతో ఈ దుస్థితి దాపురించిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకుని రైతుల ఇంటి ముంగిటకే సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రజలకు మంచి జరిగే పనులను సైతం కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోంది. తొలుత రైతు సేవా కేంద్రాలుగా పేరుమార్చింది. తర్వాత రైతులకు కనీస సేవలు కూడా అందించకుండా ఇబ్బంది పెడుతోంది.

మూలపడిన కియోస్క్ యంత్రాలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి రైతు భరోసా కేంద్రంలో కియోస్క్ యంత్రాలను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా రైతులు ఎప్పటికప్పుడు ఎరువులు, పురుగుల మందులు బుక్ చేసుకునే సౌకర్యం కల్పించింది. అలాగే వాతావరణంలో మార్పులు తెలుసుకుని, అందుకు అనుగుణంగా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టే వెసులుబాటును అందుబాటులోకి తీసుకువచ్చింది. పంట ఉత్పత్తుల మద్దతు ధరలు కూడా ఈ యంత్రాల ద్వారా రైతులు తెలుసుకునే వారు. ప్రస్తుతం రైతు సేవాకేంద్రాల్లో కియోస్క్ యంత్రాలను మూలనపడేశారు. వీటి ద్వారా రైతులకు అందే సేవలను సైతం నిలిపేశారు.

గతంలో నిత్యం అందుబాటులోనే..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆయా ఆర్‌బీకేల్లో ఉద్యానశాఖ అధికారి, వ్యవసాయాధికారి, అగ్రికల్చర్ సిబ్బంది నిత్యం రైతులకు అందుబాటులో ఉండేవారు. ఎప్పటికప్పుడు సలహాలు అందించేవారు. అప్పటి సర్కారు సైతం రైతు భరోసా కేంద్రాల నిర్వహణకు నిధుల సమస్య లేకుండా చర్యలు చేపట్టింది. ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతు సేవాకేంద్రాల నిర్వహణను గాలికి వదిలేసింది.

ఇప్పటికీ అదే నిర్లక్ష్యం

జిల్లాలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 503 రైతు భరోసా కేంద్రాలు(ఆర్‌బీకే)లు ఏర్పాటు చేసింది. రూ.109 కోట్లు మంజూరు చేసి సొంత భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. రూ.74.12 కోట్లు వెచ్చించి పలు గ్రామాల్లో 340 పక్కా భవనాలు నిర్మించింది. మరో 163 భవనాలను వివిధ దశల్లోకి తీసుకువచ్చింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత భవన నిర్మాణ పనులను నిలిపివేసింది. రైతు సేవా కేంద్రాలని ప్రకటించి సేవలను దూరం చేసింది. కేవలం ధాన్యం కొనుగోళ్లకు మాత్రం ఆయా భవనాల్లో కొన్నింటిని వినియోగిస్తోంది. ఆయా కేంద్రాల్లోని సిబ్బందిని సర్వేలు, పింఛన్ల పంపిణీ అంటూ బయటకు పంపేస్తోంది. అన్నదాతలకు అందుబాటులో లేకుండా కుట్రపూరితంగా వ్యవహరిస్తోంది.

గతంలోనే మేలు



పండించిన పంట విక్రయించేందుకు ఖాళీ సంచుల కోసం రైస్ మిల్లర్ల వద్దకు వెళ్లాల్సి వస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ధాన్యం విక్రయాలకు ఖాళీ సంచులను రైతు భరోసా కేంద్రాల వద్దకు వెళ్లి తెచ్చుకునే వాళ్లం. ఇప్పుడు మిల్లర్ల మీద ఆధారపడాల్సి వస్తోంది. ఇప్పటికైనా పాత పద్ధతిలోనే సేవలందిస్తే బాగుంటుంది. ఏది ఏమైనా రైతులకు మాత్రం గతంలోనే మేలు జరిగింది.

– బలరామరెడ్డి, రైతు, గంగాధర నెల్లూరు.

భరోసా లేదు



కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా.. ఇప్పటికీ ఒక్క విడత కూడా రైతు భరోసా సొమ్ము ఇవ్వలేదు. ఎన్నికల హామీలను తుంగలో తొక్కారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విత్తనం నుంచి ఎరువుల వరకు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించేవారు. ఇప్పుడు అక్కడకు ఎప్పుడు వెళ్లినా తాళం వేసే ఉంటోంది. ఇక సేవల సంగతి సరేసరి. మళ్లీ మాకెప్పుడు మంచి రోజులు వస్తాయో.

- రామ్మూర్తి, రైతు, ముడిపల్లె, నగరి మండలం

ఎరువుల ఊసే లేదు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆర్‌బీకేల ద్వారా ఎరువులు, పురుగుల మందులు బుక్ చేసుకునేవాళ్లం. ప్రస్తుతం రైతు సేవా కేంద్రాల ద్వారా ఆ అవకాశం లేదు. ఎరువుల ఊసే ఎవరూ ఎత్తడం లేదు. గతంలో కియోస్క్ మిషన్ల ద్వారా నాణ్యమైనవి దొరికేవి. వాతావరణం, మద్దతు ధరలు ఎప్పటికప్పుడు తెలిసేవి. ఇప్పుడు రైతు సేవాకేంద్రాల్లో సిబ్బందే ఉండడం లేదు.

– సుధాకర్, రైతు, పాలసముద్రం

కమిషనర్ చిన్నయ్యపై చర్యలు?

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగర పాలక సంస్థలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి, ప్రస్తుతం సూళ్లూరుపేట మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న చిన్నయ్యపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ (డీఎంఏ) వారం క్రితం ఆదేశాలు జారీ చేసింది. విధుల్లో చేరడం, ఉద్యోగోన్నతులు పొందడంలో అక్రమాలకు పాల్పడినట్లు అందిన ఫిర్యాదులపై విచారణ చేపట్టిన అనంతపురం మున్సిపల్ ఆర్‌డీ విశ్వనాథ్ నివేదిక మేరకు చిన్నయ్యను వెంటనే సూళ్లూరుపేట కమిషనర్‌గా రిలీవ్ చేస్తూ.. చిత్తూరు కార్పొరేషన్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా నియమించి, విధుల్లో చేరిన తర్వాత సస్పెండ్ చేసి, క్రిమినల్ కేసు నమోదు చేయాలని పేర్కొంది. అలాగే చిన్నయ్యకు అపాయింట్‌మెంట్ ఆర్డర్, ప్రమోషన్లు ఇచ్చిన అధికారులపై సైతం క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. అయితే దీనిపై చిన్నయ్య హైకోర్టును ఆశ్రయించడంతో జీఓపై కోర్టు స్టే విధించింది. అయితే చిన్నయ్యపై క్రమశిక్షణ చర్యలు చేపట్టే దిశగా అధికారులు న్యాయ సలహాలు తీసుకుంటున్నారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 84113 మంది స్వామివారిని దర్శించుకోగా 33,868 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.12 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 15 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

కిక్కిరిసిన కాణిపాకం



కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగింది. అన్ని క్యూలు కిక్కిరిశాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. - కాణిపాకం

బోయకొండకు పోటెత్తిన భక్తులు



బోయకొండ గంగమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేసవి సెలవుల నేపథ్యంలో విద్యార్థులు, యువత పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 5 గంటలవరకు భక్తుల రద్దీ కొనసాగింది. వృద్ధులు, చిన్న బిడ్డల తల్లులు ఇబ్బందు లు ఎదుర్కొన్నారు. ఉచిత ప్రసాదాలు సరిపడా లేకపోవడంతో భక్తులు నిరాశతో వెనుతిరిగారు. కౌంటర్ల వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బోయకొండలో వివిధ టికెట్ల విక్రయాల ద్వారా ఆలయానికి రూ.12,47,400 ఆదాయం వచ్చినట్లు ఈఓ ఏకాంబరం తెలిపారు. అలాగే నిత్యాన్నదానానికి రూ.10 వేలు, గోశాలకు రూ.10,116 విరాళం వచ్చినట్లు వివరించారు. - చౌడేపల్లె

'ఉరుసు' పోస్టర్ ఆవిష్కరణ



దాదేపల్లెలోని హజ్రత్ సయ్యద్ పీర్ మషాయిఖ్ బహదూర్ అలీషా బాబా దర్గాలో ఈనెల 24, 25, 26వ తేదీల్లో అత్యంత వైభవంగా ఉరుసు మహోత్సవం నిర్వహించనున్నట్లు ముస్లిం మత పెద్దలు తెలిపారు. ఆదివారం తిరుపతిలోని మాజీ మంత్రి , ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నివాసంలో ఆయన చేతులమీదుగా ఉరుసు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డికి ఆహ్వానపత్రిక, ప్రసాదం అందజేశారు. 24న గంధం, 25న ఉరుసు, 26న తహలీల్ ఫాతెహా ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఎన్.దామోదరరాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జి.నాగభూషణరెడ్డి, మైనారిటీ నేతలు సుల్తాన్‌సాబ్, బషీర్‌సాబ్, అల్తాఫ్, షేర్‌ఖాన్, బాబాజాన్, సనావుల్లా, ఆరీఫుల్లా, ముజీబ్, రెడ్డిబాషా, అనీష్, రియా జ్, దాదాపీర్, మున్నా, జాబిద్ పాల్గొన్నారు. - చౌడేపల్లె

చిత్తూరు సీఎంటీ రోడ్డులో కూలిన వృక్షం



విజయనగర్‌కాలనీలో రోడ్డుకు అడ్డంగా పడిన విద్యుత్ స్తంభం





గాలివాన బీభత్సం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. ప్రధానంగా చిత్తూరు నగరంలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో పలు కాలనీల్లో వృక్షాలు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. కొన్ని చోట్ల మామిడి చెట్లకు కాయలు రాలిపోయాయి. జిల్లా అటవీశాఖ కార్యాలయం.. ఆర్‌అండ్‌బీ అతిథిగృహం ఆవరణలోకి వర్షపు నీరు భారీగా చేరింది. అయితే అధికార యంత్రాంగం వెంటనే సహాయక చర్యలు చేపట్టింది. రోడ్లపై కూలిన చెట్లను యుద్ధప్రాతిపదికన తొలగించింది. వేగవంతంగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించింది.

- చిత్తూరు అర్బన్/ చిత్తూరు కార్పొరేషన్/ పులిచెర్ల(కల్లూరు)







మిట్టూరులో పడిపోయిన స్తంభం, జిల్లా అటవీశాఖ కార్యాలయం ఆవరణలో చేరిన వర్షపునీరు, సాయినగర్‌కాలనీలో..., పులిచెర్ల మండలం దిగువపోకలవారిపల్లెలో నేలరాలిన మామిడి

Kaira District Co-Operative Milk Producer's Union Limited (AMUL Dairy),
Amul Dairy Road, Anand - 388001

"AMUL" - The largest Indian Dairy Co-operative of over 6 lakhs Farmer members with an annual turnover of ₹14000 crores are looking for young dynamic & result oriented professionals for its operations in the state of Andhra Pradesh at Chittoor. "AMUL" wishes to recruit for the following positions.

Position Name	Qualification	Work Experien
Sr. Officer / Executive (Purchase)	Graduate + PGD / MBA in Material Management or Supply Chian Management	Min. 10 Years
HR Officer / HR Assistant	MBA(HR) / MSW / MHRM	Min. 3 Years
Lab Technician (Chemist)	M.Sc. (Chemistry)	Min. 3 Years
Dairy Plant Operator	Diploma (Mech.) / ITI(Fitter)	Min. 3 Years
Refrigeration Operator	Diploma (Mech.) / ITI (RFM)	Min. 3 Years
Boiler Attendant	1st Class Boiler Attendant	Min. 3 Years

For more details, please log on to our website: careers.amuldairy.com
Interested Candidates having required qualification, experience, fluent in Local and Hindi language & willing to work for a cause, may apply online at careers.amuldairy.com within 07 days of publication of this advertisement..
MANAGING DIRECTOR, Amul Dairy, Anand- 388001 (Gujarat).

అపోలో హాస్పిటల్స్ చెన్నై
డా॥ K.N. రెడ్డి
M.D.,D.M., FCCP, FICC, చీఫ్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్
తేది : 10-05-2025 (శనివారం)
సమయం : ఉ॥ 8.30 గం॥ల నుండి శిబిరం ముగిసే వరకు
తేది : 11-05-2025 (ఆదివారం)
సమయం : ఉ॥ 8.30 గం॥ల నుండి మ॥ 03.00 గం॥ల వరకు
చాతి నొప్పి, ఒత్తిడి, మధుమేహం, శ్వాస ఆడకపోవుట, అధిక కొలెస్ట్రాల్, సెడెంటరీ జీవనశైలి, అధిక రక్తపోటు, ఊబకాయం, గుండెపోటు యొక్క కుటుంబ చరిత్రతో బాధపడే రోగులకు ప్రయోజనం పొందవచ్చును.
అపోలో క్లినిక్
నెం : 17 - 111, సుందరయ్య వీధి, చిత్తూరు - 517 001.
అపాయింట్ మెంట్ కొరకు :
08572-222888 / 9177911066 / 9100681066

క్లుప్తంగా

నేటితో ముగియనున్న పీజీసెట్ దరఖాస్తుల స్వీకరణ

తిరుపతి సిటీ : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 17 వర్సిటీలలో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ పీజీ కోర్సులలో ప్రవేశాల కోసం ఎస్వీయూ ఆధ్వర్యంలో నిర్వ హించనున్న ఏపీ పీజీ సెట్–2025 పరీక్షకు దర ఖాస్తుల స్వీకరణ సోమవారంతో ముగియనుంది. రూ.1000 ఫైన్‌తో ఈనెల 15 వరకు చివరి గడువుగా అధికారులు నిర్ణయించారు. పీజీ సెట్ పరీక్ష జూన్ 9వ తేదీ నుంచి నిర్వహించనున్నారు.

పిడుగుపాటుకు కొబ్బరి చెట్టు దగ్ధం

యాదమరి : మండలంలోని దళవాయిపల్లె ఆదివారం సాయంత్రం పిడుగు పడి కొబ్బరి చెట్టు దగ్ధమైంది. ఈదురుగాలుల నేపథ్యంలో హఠాత్తుగా వచ్చిన భారీ శబ్దానికి గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. ప్రాణ నష్టం వాటిల్లకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

దోపిడీ కేసులో ఇద్దరి అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పుత్తూరు : నగరి రోడ్డులోని మీనాక్షి ఏజెన్సీలో ఏప్రిల్ 19వ తేదీన పట్టపగలు ఉదయం 8 గంటలకు జరిగిన దోపిడీ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఓబులేసు తెలిపారు. నిందితులు పిచ్చాటూరు మండలం, శేషంబేడు గ్రామానికి చెందిన ఠాగూర్(17), పాండియన్(34)గా గుర్తించినట్లు వెల్లడించారు. తమినాడులోని గుమ్మిడిపూండికి చెందిన మరో ఇద్దరు నిందితులు దినేష్, జగన్‌లను అరెస్ట్ చేయాల్సి ఉందన్నారు. పట్టుబడిన నిందితుల నుంచి రూ.2 లక్షల నగదు, మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

అరకొర వైద్యం

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జిల్లా ఆస్పత్రి సమస్యల వలయంలోకి వెళ్లిపోయింది. ఖాళీ పోస్టులను సకాలంలో భర్తీ చేయకపోవడంతో సిబ్బంది కొరత వేధిస్తోంది. అవసరాలకు అనుగుణంగా మందులు లేకపోవడంతో వైద్యం పడకేసింది. దీనికితోడు ఆస్పత్రి నిర్వహణకు సైతం బడ్జెట్‌లో కోత విధించడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ఈ క్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు సోమవారం రానున్నారు. ఈ మేరకు జిల్లా ఆస్పత్రి దుస్థితిని పరిశీలించాలని రోగులు కోరుతున్నారు. చుట్టుముట్టిన సమస్యలను పరిష్కరించాలని సిబ్బంది సైతం విన్నవిస్తున్నారు.



- జిల్లా ప్రభుత్వాస్పత్రిని చుట్టుముట్టిన సమస్యలు
- భర్తీకి నోచుకోక ఖాళీగా పలు పోస్టులు
- పోస్టుమార్టానికి సైతం లేని డాక్టర్లు
- అందుబాటులో లేని మందులు
- బడ్జెట్‌లో యథేచ్ఛగా కోతలు
- నేడు జిల్లా ఆస్పత్రికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు రాక

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలో 400 పడకలు ఉన్నాయి. నిత్యం 1,200 వరకు ఓపీలు వస్తుంటాయి. అలాగే ఇన్ పేషెంట్లు 350 మంది ఉంటుంటారు. అత్యవసర సేవల నిమిత్తం జిల్లా నలుమూలల నుంచి 200 కేసుల వరకు ఓపీకి వస్తుంటాయి. అయితే ప్రభుత్వాస్పత్రిలో పలు సమస్యలు తలెత్తడంతో సరైన వైద్యం అందడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భర్తీలో నిర్లక్ష్యం

జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ప్రస్తుతం డాక్టర్ల నుంచి సిబ్బంది వరకు పలు పోస్టులు ఖాళీలగా ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పోస్టులు ఖాళీ అయితే వెంటనే భర్తీ చేసేలా చర్యలు తీసుకునేవారు. ఇప్పుడు పోస్టుల భర్తీ...అయోమయంగా మారింది. ప్రధానంగా ఆస్పత్రిలో డాక్టర్ల కొరత ఉంది. ఇద్దరు డాక్టర్లతోనే పోస్టుమార్టం చేయిస్తూ నెట్టుకొస్తున్నారు. ప్రతి నెలా 40 పైగా పోస్టుమార్టం కేసులు ఇక్కడకు వస్తుంటాయి. నలుగురు డాక్టర్లుంటే పోస్టుమార్టం సమస్య తీరుతుందని ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి. పోక్సో కేసు కౌన్సెలింగ్‌కు సంబంధించి ఒక గైనిక్ డాక్టర్ ఉండాలనే నిబంధన ఉంది. అలాగే హెడ్‌నర్సు పోస్టులు రెండు ఖాళీలున్నాయి. స్టాఫ్ నర్సులు 78 మందికి గాను 61 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఇందులో కూడా కొంత మందిని అదనపు పనులకు కేటాయించారు. ఎంఎన్ఓ, ఎఫ్ఎన్ఓలు 15 మంది అవసరమవుతోందని, జీడీఓలు 8 మంది ఉండాలని, ఫార్మాసిస్టులు 6 మంది దాకా అవసరమని ఆస్పత్రి వర్గాలు వెల్లడిస్తున్నాయి. సిబ్బంది కొరత కారణంగా పనిభారం పెరుగుతోందని పలువురు సిబ్బంది వాపోతున్నారు. దీంతో ఆస్పత్రికి వచ్చే రోగులకు సక్రమంగా సేవలు అందించేందుకు ఇబ్బందులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సకాలంలో అందని మందులు

జిల్లా ఆస్పత్రికి ముఖ్యంగా మందుల సరఫరాలో జాప్యం జరుగుతోంది. సకాలంలో అందక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. డ్రగ్స్ కేంద్రం నుంచే సరఫరా రావడం లేదని.ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి. కనీసం జ్వరం, దగ్గు, జలుబుకు సైతం మందులు లేకపోవడం గమనార్హం. దీంతో బయట మందులు కొనుగోలు చేసుకోవాలని రోగులను కోరాల్సి వస్తోందని, వారు తమపై మండిపడుతున్నారని వైద్య సిబ్బంది వాపోతున్నారు.

నిధుల కొరత

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జిల్లా ఆస్పత్రికి అవసరమైన మేరకు బడ్జెట్‌లో నిధులు కేటాయించేంది. కూటమి వచ్చాక మందులు, మాత్రలు సరఫరా కాకపోగా ఆస్పత్రి నిధులు కూడా అరకొరగా కేటాయిస్తున్నారు. చాలీచాలని నిధులిచ్చి చేతులు దులుపుకుంటున్నారు.

నేడు ఆస్పత్రి పరిశీలన

చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిని సోమవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు సందర్శించనున్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ఆయన ఆస్పత్రికి చేరుకుని పలు విభాగాలను పరిశీలించనున్నారు. రోగులు, ఆస్పత్రి అధికారులతో మాట్లాడనున్నారు. ఈతరుణంలో పై సమస్యలను తెలుసుకుని ఆస్పత్రి అభివృద్ధికి కృషికి చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు



కుక్కకాటుకు గురైన ఫణి

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ దర్శనార్థం ఆదివారం తిరుపతి నుంచి వచ్చిన ఓ కుటుంబానికి చేదు అనుభవం ఎదురైంది. అమ్మవారి దర్శనంకోసం నడచి వెళుతుంగా ఫణి(10) అనే బాలుడిపై వీధి కుక్కలు దాడిచేశాయి. దీంతో చిన్నారి తొడభాగంలో తీవ్రంగా గాయాలయ్యాయి. ఆందోళన చెందిన కుటుంబీకులు వెంటనే బోయకొండ గంగాపురంలోని పీహెచ్‌సీకి వెళ్లారు అక్కడ వైద్యం చేసేందుకు ఎవరూ లేరు. దీంతో గంగమ్మ ఆలయ పరిపాలన కార్యాలయానికి చేరుకుని తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఫలితం లేకపోవడంతో బాలుడిని హుటాహుటిన చౌడేపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించాల్సి వచ్చింది. నిత్యం వేలాది మంది విచ్చేసే బోయకొండ ఆలయం వద్ద కనీసం ప్రాథమిక చికిత్సకు అవసరమైన మందులు కూడా లేకపోవడంపై భక్తులు మండిపడుతున్నారు. అలాగే పెద్దసంఖ్యలో హల్‌చల్ చేస్తున్న వీధి కుక్కలను నియంత్రించాల్సిన అవసరముందని కోరుతున్నారు.

ఎర్రచందనం దుంగలు సహా కారు సీజ్



సీజ్ చేసిన దుంగలు, కారుతో తిరుపతి అటవీశాఖ అధికారులు

తిరుపతి మంగళం : అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనం దుంగలతోపాటు కారును సీజ్ చేసినట్లు తిరుపతి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి వైల్డ్‌లైఫ్ డీఎఫ్‌వో వివేక్‌కు అందిన రహస్య సమాచారం మేరకు మామండూరు బీట్ పరిధిలో ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. ఒక కారు ఆగకుండా వెళ్లడంతో వెంబడించినట్లు తెలిపారు. దుండగులు కారును వదిలేసి వెళ్లిపోయారని, అందులో పరిశీలించగా 26 ఎర్రచందనం దుంగలు ఉన్నాయని తెలిపారు. కారుతో పాటు ఎర్రచందనం దుంగలను సీజ్ చేసినట్లు వివరించారు. తనిఖీల్లో ఎఫ్ఆర్‌వో సుదర్శన్‌రెడ్డి, డీఆర్‌వో గౌస్ కరీమ్, ఎఫ్‌బీవోలు శరవణకుమార్, జాన్ శ్యామ్యూల్, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

డబ్బులు కాసే చెట్టు!

డబ్బులేమయినా చెట్లకు కాస్తాయా అంటే అవుననే అంటున్నారు మహోగని సాగు చేస్తున్న రైతులు.. ఏళ్లతరబడి ఒకే తీరు పంటలు వేస్తూ దిగుబడి రాక పెట్టుబడులు అందక అనేక అవస్థలు పడుతున్న అన్నదాతలు ఇప్పుడిప్పుడే ఇతర పంటలపై దృష్టి సారిస్తున్నారు. అందులో భాగంగా మహోగని చెట్ల పెంపకంపై ఆసక్తి చూపుతున్నారు. 12 ఏళ్లపాటు ఓపిక పడితే ఒకేసారి కోటీశ్వరులు కావచ్చని వెల్లడిస్తున్నారు. అనేక ఔషధగుణాలతోపాటు మార్కెట్‌లో విపరీతంగా డిమాండ్ ఉంటే ఈ చెట్లను పెంచేందుకు పలువురు ముందుకు వస్తున్నారు.





- మహోగని సాగుపై ఆసక్తి చూపుతున్న రైతులు
- జిల్లాలో ప్రస్తుతం 150 ఎకరాల్లో ప్రయోగాత్మకంగా సాగు
- 12 ఏళ్లకు కోత.. ఆదాయం రూ.కోట్లలో..

విజయపురం : జిల్లాలోని పలు ప్రాంతాల్లో పలువురు రైతులు వినూత్నంగా మహోగని చెట్ల సాగుకు మొగ్గుచూపుతున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే 150 ఎకరాలకు పైగా మహోగని సాగు చేపట్టారు. విజయపురం మండలంలో 12 ఎకరాలు, నగరి–7, సత్యవేడు–13, చిన్నగొట్టిగల్లు–10, ఎర్రవారిపాళెం –10 ఎకరాలు ప్రస్తుం సాగులో ఉన్నాయి. ఈ చెట్లు గోధుమ రంగు కలపతో విశిష్టంగా ఉంటాయి. మహోగనికి చెందిన కలప, ఆకులు, గింజలు మార్కెట్‌లో అధిక ధరకు విక్రయిస్తున్నారు. ఈ చెట్టు చెక్కతో ఓడలు, ప్లైవుడ్, ఆభరణాలు వంటి వస్తువులను తయారు చేస్తారు. అలాగే సంగీత వాయిద్యాలు, విగ్రహాల తయారీలోను వాడతారు.

సారవంతమైన నేల అవసరం

మహోగని వేర్లు భూమికి కొంత పైభాగంలోనే ఉంటాయి. కాబట్టి కొండ ప్రాంతాల్లో కాకుండా మిగిలిని అన్ని రకాల భూముల్లో పెరుగుదలకు అనుకూలంగా ఉంటుంది. మహోగని చెట్లు పెరగడానికి సారవంతమైన నేల అవసరం. బలమైన గాలులు వీచే చోట ఈ చెట్లను నాటకూడదు.

ఎకరాకు రూ. 50వేల వ్యయం

ఎకరా పొలంలో 120 మహోగని మొక్కలు నాటుకోవచ్చు. ఒక మొక్క రూ. 400న ఉంచి 450 వరకు ధర పలుకుతుంది. ఈ విధంగా ఎకరాలో నాటేందుకు రూ. 45వేలు నుంచి 55వేలు వెచ్చించాల్సి వస్తుంది. మహోగని చెట్టు పరిపక్వం చెందేందుకు 12 ఏళ్లు పడుతుంది. అయితే 5 ఏళ్లకు ఒకసారి విత్తనాలను ఉత్పత్తి చేస్తుంది. ఒక కేజీ మహోగని విత్తనం ధర మార్కెట్‌లో రూ. 1,000. ఈ విధంగా కూడా రైతుకు ఆదాయం ఉంటుంది. అలాగే మహోగని చెట్టు 60 నుంచి 80 అడుగుల వరకు పెరుగుతుంది. ఒక క్యూబిక్ ఫీట్ రూ. 1,500 నుంచి 2,500 వరకు రేటు ఉంది. ఇలా ఒక మహోగని చెట్టుకు రూ. 80 నుంచి 1.20లక్షల వరకు ఆదాయం వస్తుంది. ఒక ఎకరంలో 120 మహోగని చెట్లను నాటడం ద్వారా 12 ఏళ్లలో రూ.కోటి వరకు ఆదాయం పొందవచ్చు.

ఆరోగ్యానికి సైతం..

మహోగని చెట్టుకు మరో ప్రత్యేకత ఉంది. ఈ చెట్టు ఆరోగ్యానికి చాలా మంచిది. ఈ మొక్క ఔషధ గుణాలతో నిండి ఉంది. మహోగని చెట్టు దగ్గర దోమలు కూడా చేరవు. దీని ఆకులు, విత్తనాలను దోమల నివారణతోపాటు క్రిమిసంహారకాలను తయారు చేయడానికి ఉపయోగిస్తారు. అలాగే రంగులు, వార్నిష్‌లు, సబ్బులతోపాటు మందుల తయారీకి వినియోగిస్తారు. ఈ చెట్టు బెరడు నుంచి అనేక ఔషధాలను కూడా సిద్ధం చేస్తారు.

మూడు ఎకరాల్లో సాగు

నేను మూడు ఎకరాల్లో మహోగని చెట్లు సాగు చేస్తున్నా. మా మిత్రుడు కూడా ఇదే సాగు చేస్తున్నాడు. ముందు ఆయన సలహా మేరకే నేను కూడా ఇందులో దిగాను. 12 ఏళ్ల తర్వాత అధిక ఆదాయం ఉంటుందని తెలిసింది. కాకపోతే ఓపిక ఉండాలి. కొత్తరకం చెట్టు కాబట్టి మంచి ఆదాయం ఇస్తుందని ఎదురుచూస్తున్నా.

– శేఖర్‌రాజు, కోసలనగరం. విజయపురం మండలం

మామిడి తోటకు నిప్పు



కాలిన మామిడి తోట

శ్రీరంగరాజపురం : మండలంలోని ఎగువ కమ్మకండ్రిగలో భాస్కర్‌నాయుడు అనే రైతుకు చెందిన నాలుగు ఎకరాల మామిడి తోటకు ఆదివారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో సుమారు 250 మామిడి చెట్లతోపాటు డ్రిప్ సామగ్రి కాలిపోయినట్లు బాధితుడు వెల్లడించారు. రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని వెల్లడించారు. ప్రభుత్వ స్పందించి తను ఆదుకోవాలని కోరారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి



వినాయక మృతదేహం

బంగారుపాళెం : మండల కేంద్రంలోని ఓ వైన్స్ షాప్ వద్ద ఆదివారం సాయంత్రం ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానిక దళితవాడకు చెందిన వినాయక (49) అతిగా మద్యం తాగడంతో మరణించినట్లు సమాచారం. అయితే దీనిపై ఎలాంటి సమాచారం అందలేదని పోలీసులు వెల్లడించారు.

ప్రశాంతంగా ‘నీట్’

- 677 మంది విద్యార్థులు హాజరు
- 33 మంది గైర్హాజరు



పీవీకేఎన్ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

చిత్తూరు కలెక్టరేట్ : నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో ఆదివారం నేషనల్ ఎలిజిబిలిటీ ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్) ప్రశాంతంగా నిర్వహించారు. చిత్తూరులోని రెండు పరీక్ష కేంద్రాల్లో మొత్తం 710 మంది విద్యార్థులకు గాను 677 మంది విద్యార్థుకు హాజరయ్యారు. 33 మంది గైర్హాజరైనట్లు పరీక్షల సిటీ కో–ఆర్డినేటర్ జీవనజ్యోతి వెల్లడించారు.

ముందుగానే కేంద్రాలకు

పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించగా, 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకే విద్యార్థులను ఆయా కేంద్రాల్లోకి అనుమతిస్తామని అధికారులు ముందస్తుగా వెల్లడించారు. దీంతో పలు ప్రాంతాల నుంచి పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు ముందుగానే చేరుకున్నారు.

అధికారుల తనిఖీ

పీవీకేఎన్, సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలల్లోని పరీక్ష కేంద్రాలను కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, ఎస్పీ మణికంఠ చందోలు తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. కార్యక్రమంలో చిత్తూరు ఆర్‌డీఓ శ్రీనివాసులు,ప్రిన్సిపల్ మనోహర్, ఏఆర్ డీఎస్పీ మహబుబ్‌బాషా, పీవీకేఎన్ పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ శరవణ పాల్గొన్నారు.

దర్జాగా ప్రభుత్వ భూమి ఆక్రమణ



ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన షెడ్డు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: అధికారం అండతో కూటమి నేతలు రెచ్చిపోతున్నారు. విలువైన ప్రభుత్వ భూములను యథేచ్ఛగా ఆక్రమించుకుంటున్నారు. ఈ విషయం తెలిసినా రెవెన్యూ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తుండడం విమర్శలకు దారితీస్తోంది. చంద్రగిరి పట్టణంలో విలువైన ప్రభుత్వ భూమిని ఓ మైనార్టీ నేత అక్రమించుకుని గుట్టు చప్పుడు కాకుండా షెడ్డు నిర్మించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చంద్రగిరి లెక్కదాఖలా సర్వే నంబరు 61/3లో కొంత మేర గ్రామకంఠం భూమి ఉంది. ఆ భూమిలో కొన్నేళ్లుగా ముస్లింలు పీర్ల పండుగను నిర్వహించుకుంటున్నారు. మిగిలిన సందర్భంగా భూమి ఖాళీగా ఉంది. ప్రస్తుతం దాని విలువ రూ.50 లక్షలకు పైగా ఉంది. దీనిపై అధికార పార్టీకి చెందిన ఓ మైనార్టీ నేత కన్ను పడింది. ఇటీవల వరుస సెలవులు రావడంతో శరవేగంగా అక్రమంగా షెడ్డును నిర్మించాడు. తరతరాలుగా పీర్లచావిడిగా వినియోగించుకుంటున్న భూమిని ఆక్రమించుకోవడంపై ముస్లిం పెద్దలు మండిపడుతున్నారు. 2022లో కూడా ఈ స్థలాన్ని ఆక్రమించుకోవడానికి అతను యత్నించాడని, అప్పట్లో రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారని పేర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అతను ఆక్రమించుకున్నాడని వాపోతున్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి 100 మీటర్ల దూరంలోనే ఆక్రమణ

తహసీల్దార్ కార్యాలయానికి 100 మీటర్ల దూరంలో ఈ ఆక్రమణ జరుగుతున్నా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై ముస్లింలు, స్థానికులు మండిపడుతున్నారు. అక్రమంగా షెడ్డు నిర్మిస్తున్నట్టు రెండు వారాల క్రితం రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెబుతున్నారు. రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సీఎం, డిప్యూటీ సీఎం, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు చెబుతున్నారు. దీనిపై వీఆర్‌వో పురుషోత్తంను వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

పొలంలో వృద్ధుడి మృతదేహం

గంగవరం : మండలంలోని నడింపల్లె సమీప పొలంలో గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని ఆదివారం స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడు చనిపోయి సుమారు రెండు రోజులు గడిచినట్లు భావిస్తున్నారు. మృతుడి ఒంటిపై తెల్లటి చొక్కా, లుంగీ, టవల్ ఉన్నాయని ఆచూకీ తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని పోలీసులు కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

చెట్టు కొమ్మలు తొలగిస్తుండగా ప్రమాదం



ట్రాన్స్‌ఫార్మర్‌పై నిల్చొని చెట్టు కొమ్మలు తొలగిస్తున్న జూనియర్ లైన్‌మన్ మురళి



విద్యుత్ షాక్‌తో ట్రాన్స్‌ఫార్మర్‌పైనే కుప్పకూలిన మురళి

- విద్యుత్ షాక్‌కు గురైన లైన్‌మన్

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం చిగురువాడ పంచాయతీ పరిధిలోని సంస్కృతి నగర్‌లో ఆదివారం సాయంత్రం పెనుగాలులకు చెట్టుకొమ్మలు విరిగి విద్యుత్తు తీగలపై పడ్డాయి. దీంతో ఆ ప్రాంతంలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగింది. స్థానికుల సమాచారం మేరకు విద్యుత్తు శాఖలో జూనియర్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్న మురళి అక్కడకు చేరుకుని విద్యుత్తు సబ్ స్టేషన్ నుంచి లైన్ ఆఫ్ చేసుకుని చెట్టు కొమ్మలు తొలగించే పనులు చేపట్టాడు. ట్రాన్స్‌పార్మర్ కూడా ఆఫ్ చేసుకుని దానిపై నిలుచుని చెట్టు కొమ్ములు తీస్తుండగా హఠాత్తుగా కరెంటు సరఫరా కావడంతో షాక్‌కు గురై ట్రాన్స్‌పార్మర్‌పైనే కుప్పకూలిపోయాడు. స్థానికులు అరవడంతో అతడితో పాటు వచ్చిన విద్యుత్తు సిబ్బంది సబ్ స్టేషన్‌కు సమాచారం అందించి ఆ ప్రాంతంలో మొత్తం సరఫరా నిలిపివేయించారు. అనంతరం లైన్‌మెన్‌ను కిందకు దించి చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు.



మురళిని ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు



సాక్షి క్లాసిఫైడ్స్

Education

DIRECT FINAL YEAR
■ Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry.9381287629

Real Estate

PLOT FOR SALE
■ తిరుపతి కొర్లగుంట ప్రైమ్ లోకేషన్‌లో 125 అంకణాల కమర్షియల్ బిట్ తక్కువ ధరకే. సంప్రదించండి సెల్: 91609 68886, 98486 25575.

Wanted

■ తిరుపతి శ్రీనివాస హోటల్ కపిలతీర్థం వద్ద పనిచేయుటకు టిఫిన్ మాస్టర్లు, క్లీనింగ్ స్టాఫ్, సర్వీస్ స్టాఫ్ కావలెను. సెల్: 70937 35578, 91005 93958.

■ Gurappa Parameswara Electrical & Civil Works, Tirupati Walk-In - Hiring - Accountant Must have a Degree in Accounting (or) Finance at least 5 Years of Work Experience Should know how to use Accounting Software must Understand GST & Taxes. Cell: 9133309137, Email: gurappaparameswara@gmail.com

■ తిరుపతి ప్రముఖ Petrol Bunk నందు పనిచేయుటకు Pump Boys కావలెను. ఆకర్షణీయమైన జీతం: 14000 + Incentives ఇవ్వబడును. సెల్: 9030144410, 7799995945

■ మీ ఇంటివద్దనే వుంటూ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 25–30వేలు వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్: 85504 67459.

■ తిరుపతిలోని వేదాంతపురం సర్కిల్లో రామచంద్రపురంలో సెక్యూరిటీ గార్డ్స్ 10 No's కావలెను. జీతం, వసతి కలదు. 8985322255, 8790782255

■ Wanted Security Field Officer from Gudur and know the industries can call us . CASS, Nellore, CellNo. 99510 72170.

■ శివకార్తికేయ హోంకేర్‌లో వృద్ధులను,పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావాలి. ఫ్రీ వసతి భోజనం. జీ: 18K. ఫోన్: 9912011499, 9912011899

■ కర్నూలుకు కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/ పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP&డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు.ఫ్రీరూం+భోజనం.Hyd.9182260297

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ. 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact
9705444178
9951602970

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశ్వసించి పరిశీలించి పెడమ ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.